క్లుప్తంగా

చిత్తూరు వెళ్లి పింఛన్ అందజేత


ముద్దప్పకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన ముద్దప్ప కొద్ది రోజుల క్రితం గొంతు సంబంధిత వ్యాధితో చిత్తూరులోని ఓ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు ఆయనకు గొంతు ఆపరేషన్ చేశారు. దీంతో స్వగ్రామానికి వచ్చి పింఛన్ తీసుకోలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న వలంటీర్ రియాజ్ ఖాన్ శుక్రవారం చిత్తూరు వెళ్లి, ముద్దప్పకు పింఛన్ డబ్బులు అందజేశాడు.

మట్కాబీటర్ అరెస్ట్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన వెంకట చలపతి శుక్రవారం పరమేశ్వరి సినిమా హాల్ వెనుక మట్కా రాస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి, రూ.40,150 నగదు స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ శ్రీసత్యసాయి జిల్లా శాఖ, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఆర్డీటీ ఆధ్వర్యంలో ఉంటున్న మనోవికాస కేంద్రం, మెదడు పక్షవాత కేంద్రం, హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధిత చిన్నారులు, అనాథ పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, ఎల్వీ ప్రసాద్ కో ఆర్డినేటర్ ఎండీ రఫిక్, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ రమేష్, ఇన్‌చార్జ్ సిస్టర్ అగ్నిస్, సిస్టర్ కథరిన, సిస్టర్ సమత, టెక్నీషియన్లు రఫిక్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుల గుర్తింపులో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న డీఎల్ఏటీపీ తిప్పయ్య

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపులో అలసత్వం ప్రదర్శించకుండా ప్రారంభ దశలోనే గుర్తించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ప్రోగ్రాం అధికారి (డీఎల్ఏటీపీ) తిప్పయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో టీబీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, నివారణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి ఆరు నెలల పాటు వైద్య చికిత్సలు అందిస్తే నయం చేయవచ్చన్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ అధికంగా కేసులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు పొందిన క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు నెలకు రూ.500 ఆర్థిక సహాయం, రూ.750 విలువైన ఫుడ్‌గ్రెయిన్స్ అందించడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీపీఎంఓ రెడ్డి కుమార్‌రెడ్డి, జిల్లా అర్బన్ సూపర్‌వైజర్ అబీద్ బాషా, డీపీసీ శ్రావణి, సీపీఎం కో–ఆర్డినేటర్ నాగమణి,మహేష్ పాల్గొన్నారు.


ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ముదిగుబ్బ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 3, 4 వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతు జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అదే విధంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రాయుడు, శ్రావణ్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... అనంతపురం నుంచి బెంగళూరు కెంపెగౌడ విమానాశ్రయానికి వెళ్తున్న కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న ట్రక్కును ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతినింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ పరుశురాం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, హైవే పోలీసులు వెంటనే అతన్ని అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

విస్తృతంగా ప్రచారం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: మండలంలోని ఈదులపల్లి, గాండ్లవారిపల్లి, మర్తాడు తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్, కిరణ్‌మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గృహ నిర్మాణాలు

- పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- నూతనంగా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలు
- మొదటి విడతలో 4 నియోజకవర్గాలకు 44,056 గృహాల మంజూరు


కొత్తచెరువులోని జగనన్న కాలనీలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

అమడగూరు/కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. ఇంటికోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదలకు సొంతంగా ఇంటిని నిర్మించుకునే అవకాశం కలిగింది. సెంటు స్థలం లేకున్నా ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి జగనన్న కాలనీల్లో స్థలాలను మంజూరు చేసి, లబ్ధిదారు పేరు మీద పట్టాలను మంజూరు చేసింది. స్థలాలను పొందిన వారందరికీ ప్రభుత్వ ప్రోత్సాహకం కింద నూతన గృహాలను మంజూరు చేసింది. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో పాటుగా గ్రామాల్లో సైతం ఇంటి నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. పూర్తయిన ఇంటి నిర్మాణం మేరకు వెంటనే సంబంధిత హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బిల్లులను ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. సకాలంలో బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. నూతనంగా రూపు దిద్దుకుంటున్న జగనన్న కాలనీలకు ప్రభుత్వమే ఉచితంగా విద్యుత్ సౌకర్యం, తాగునీరు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది.

44,056 గృహాల మంజూరు..

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాలకు రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలకు మొదటి విడతలో భాగంగా ప్రభుత్వం 44,056 గృహాలను మంజూరు చేసింది. ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే నిర్మాణాలు పెద్ద ఎత్తున ఊపందుకున్నాయి. ఇళ్లు మంజూరైన వారందరికీ గుణాది తీయకనే సిమెంట్ ఇవ్వడం, గుణాది పూర్తవగానే మొదటి బిల్లులో భాగంగా రూ.70 వేలు బిల్లు ఇస్తుండటంతో ప్రభుత్వంపై నమ్మకం కలుగుతోంది. లబ్ధిదారులంతా ఇళ్లను నిర్మించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు హౌసింగ్ అధికారులు ప్రతి గ్రామానికి వెళ్తూ లబ్ధిదారులను కలిసి, పనులు వేగవంతం అయ్యేలా చూస్తున్నారు. ఆలస్యం కాకుండా బిల్లులు పంపుతుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

గత ప్రభుత్వం విఫలం

గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పేదలకు నూతన గృహాలను మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైంది. దరఖాస్తు చేసుకున్న వారిలో కనీసం 10 శాతం మందికి కూడా ఇళ్లను ఇవ్వలేక చేతులెత్తేసింది. అంతేకాకుండా గత 7 దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వారందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసి రికార్డును సృష్టించింది. చాలా ప్రాంతాల్లో వందలాది ఇళ్లను ఒకేచోట నిర్మింపజేస్తూ జగనన్న కాలనీలుగా వెలస్తుండటం ప్రభుత్వానికి మరో మైలురాయిగా చెప్పుకోవచ్చు.

ఎమ్మెల్యే దుద్దుకుంట చొరవతో..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వం పెద్దెత్తున నూతన గృహాలను మంజూరు చేసింది. అయితే పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని అమడగూరు, ఓడిచెరువు, నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎక్కడా లేని విధంగా మొదటి విడతలోనే 18,720 ఇళ్లు మంజూరయ్యాయి. ఇటీవల చేపట్టిన గడప, గడపకూ మన ప్రభుత్వంలో ఇంటి కోసం వచ్చిన ప్రతి దరఖాస్తుదారుడికీ నూతన గృహాన్ని మంజూరు చేయించారు.

నియోజకవర్గం	మంజూరైన గృహాలు	నిర్మాణంలో ఉన్న ఇళ్లు
పుట్టపర్తి	18,720	11,150
కదిరి	3,271	2,857
ధర్మవరం	14,466	12,523
రాప్తాడు	7,599	6,139
మొత్తం	44,056	32,669

సొంతింటి కల నెరవేరింది



నా జీవితంలో సొంతింటిని నిర్మించుకోవాలనే కల నెరవేరింది. గత ప్రభుత్వంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. అయితే గ్రామ వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి ఇళ్లు కావాలా అని అడిగి దరఖాస్తు చేశారు. ప్రభుత్వం నాకు ఇళ్లు మంజూరు చేయడంతో కుటుంబ సభ్యులంతా చాలా సంతోషంగా ఉన్నాము. ప్రభుత్వానికి తోడుగా ఉండాలనుకున్నాం.

– లక్ష్మీదేవమ్మ, రెడ్డివారిపల్లి, అమడగూరు మండలం

అర్హులందరికీ ఇళ్ల మంజూరు



ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వారందరికీ నూతన గృహాలను మంజూరు చేస్తున్నాం. మంజూరు చేయడమే కాకుండా వారి వెంటే ఉంటూ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడూ ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ బిల్లులను చెల్లిస్తున్నాం. లబ్ధిదారులంతా సంతోషంగా ఇళ్లను కట్టుకుంటున్నారు. ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ .1.80 లక్షలను ప్రోత్సాహకంగా ఇస్తోంది.

– భానుప్రకాష్, హౌసింగ్ ఏఈ

టీడీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

నల్లమాడ: జగనన్న పక్కాగృహాల నిర్మాణానికి సంబంధించి బిల్లులు రావంటూ గ్రామాల్లో టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని కొండకింద తండాలో జగనన్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం నాయకులు పరిశీలించారు. తండాలో 85 మంది లబ్ధిదారులకు జగనన్న పక్కాగృహాలు మంజూరు కాగా అందరు బేస్‌మెంట్ వరకూ నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ మండలంలో 379 మందికి బేస్‌మెంట్ బిల్లులు, మరో 10 మంది లబ్ధిదారులకు గోడల బిల్లు సైతం వారి బ్యాంక్ ఖాతాలో జమ అయినట్లు హౌసింగ్ ఏఈ వరుణ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు, వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు ఏ.గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, షంషీర్, నాయకులు మంగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు విషయమై ఘర్షణ

గాండ్లపెంట: మండల పరిధిలోని వద్దిరెడ్డిపల్లి గ్రామంలో అప్పు విషయమై శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. వివరాలు.. యర్రచేనుపల్లికి చెందిన రేణుక వద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డికి కొంత నగదు అప్పుగా ఇచ్చింది. సంవత్సరాలు గడుస్తున్నా సురేష్‌రెడ్డి అప్పు తీర్చలేదు. గ్రామం వదిలి వేరేచోటుకు వెళ్లిపోయాడు. శుక్రవారం అప్పు తీసుకున్న వ్యక్తి వద్దిరెడ్డిపల్లి గ్రామానికి వచ్చాడని తెలుసుకున్న రేణుక గ్రామానికి వెళ్లి అప్పు చెల్లించాలని కోరింది. ఈ విషయంలో ఇరువురి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో సురేష్‌రెడ్డి తలకు గాయమైంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. యర్రచేనుపల్లికి చెందిన రేణుక తనకు రావాల్సిన అప్పు విషయమై ఫిర్యాదు చేశారన్నారు. మరో వర్గం నుంచి ఫిర్యాదు అందలేదన్నారు. కాగా అదే గ్రామంలో ఉన్న వార్డు సభ్యురాలు భాగ్యమ్మ.. సురేష్‌రెడ్డి గ్రామానికి వచ్చాడంటూ రేణుకకు సమాచారం అందించిందన్నారు. అప్పు చెల్లించాలని అడిగేందుకు వెళ్లిన తనపై సురేష్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి విలేకరి రమణారెడ్డి కత్తి, కట్టెలతో దాడి చేయడంతో ఎడమ చేయి విరిగిందని రేణుక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


ఓడీ చెరువు: పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


యర్రదొడ్డి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి

ఓడీ చెరువు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి మండలంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులను కలసి ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. తంగేడుకుంట, గౌనిపల్లి, సున్నంపల్లి,ఓడీ చెరువు పంచాయతీ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ ఫకృద్దీన్ పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఫర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు మండల చైర్మన్ లక్ష్మీరెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ఆనందరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాష, సర్పంచులు గోవిందు, జగన్ మోహన్‌చౌదరి, సహకార సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకోండి

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఓటర్లకు వివరించాలని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పట్నం, కాళసముద్రం, యర్రదొడ్డి,కదిరికుంట్లపల్లి గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీఎస్ఆర్ఐ విద్యాసంస్థల చైర్మన్ వెన్నుపూస విశ్వనాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. శాసనమండలి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు.

నల్లమాడ: చారుపల్లి పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పశ్చిమ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ తిప్పమాంబ భర్త అశ్వర్థనారాయణ, మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు, వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, సచివాలయ కన్వీనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం, ఈదుల ముష్టూరు, మాల్యవంతం, పోట్లమర్రి, దంపెట్ల గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపీపీ వెంగళరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమతం ఈశ్వరయ్య, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు కమతం వరలక్ష్మీ, కురుబాకర్‌నాయుడు, మాజీ సర్పంచు సంజీవు, వీరనారప్ప, యర్రభూమి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమడగూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్పంచులు సురేంద్రరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆదినారాయణ, షబ్బీర్, ఎంపీటీసీ పెద్దప్పయ్య, నాయకులు చిన్నప్ప, రంగారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

తాడిమర్రి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు తాడిమర్రి రమణారెడ్డి, మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, మల్లప్పగారి మాధవరెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆల్లే సాయినాథ రెడ్డి, పెద్ద ఓబిలేసు, కాటమయ్య పాల్గొన్నారు.

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పార్టీ సీనియర్ నేత, సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బుక్కపట్నం మండలంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనగానపల్లి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున పోటీస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ మండల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, ప్రభాకర్, రమణారెడ్డి ప్రచారం నిర్వహించారు.

రుచికరమైన భోజనం అందించండి


భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచందర్

కొత్తచెరువు: పాఠశాల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచందర్ సూచించారు. శుక్రవారం కొత్తచెరువులోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే భోజనం పప్పు, గుడ్డు, చిక్కీని రుచి చూశారు. వంటలు ఎలా ఉన్నాయి? తగినంత భోజనం పెడుతున్నారా? సక్రమంగా గుడ్డు, చిక్కీలు అందిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సరఫరా అయ్యే బియ్యం, గుడ్ల వివరాలపై ఆరా తీశారు. హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నాణ్యతతో కూడిన ఆయిల్ వాడాలని సూచించారు. పుట్టపర్తి రహదారిలోని ఆంధ్రబ్యాంక్ సమీపంలో నిర్వహిస్తున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్, బేకరీని తనిఖీ చేశారు. ఇక్కడ వాడుతున్న నూనె నిర్ణీత టెంపరేచర్ కంటే ఎక్కువగా ఉండటంతో ఆహార పదార్థాలు విషతుల్యం అవుతున్నాయని తెలిపారు. ఇలాంటి నూనెలు వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి


వీడియో ద్వారా శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ విజయవంతంగా ముగిసేలా చూడాలని ఎన్నికల శిక్షణ తరగతుల మాస్టర్ ట్రైనర్లు చిన్నయ్య, ఖుతిజతిన్‌కుబ్రా పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. బ్యాలెట్ బాక్సు, బ్యాలెట పేపర్ వినియోగం పీఓ డైరీ ప్రాధాన్యత, ఎన్నికల నియమావళి అమలు, ఓటింగ్ విధానం, నూతన ఓటర్ల జాబితా, పేపర్ సీలు పరిశీలన తదితర ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఓటింగ్ ప్రారంభం, ఆ తర్వాత అధికారులు చేపట్టే విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల విభాగం డీటీ మైనుద్దీన్, నరసింహులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లు ఓటు వేసేటప్పుడు ఎన్నికల కమిషన్ ఇవ్వబడ్డ వైలెట్ కలర్ పెన్నుతోనే క్రమ సంఖ్యలు 1, 2, 3 ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఏదైనా ఐడెంటి కార్డు తీసుకెళ్లాలని సూచించారు.

ఒంటరి మహిళలకు చేయూత


పరికరాలను అందజేస్తున్న స్పానిష్ మహిళ

బత్తలపల్లి: ఒంటరి మహిళలు ఇతరుల మీద ఆధారపడకుండా గౌరవంగా జీవించాలన్నదే ఆర్డీటీ ధ్యేయమని ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెక్టార్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో తొమ్మిది మంది ఒంటరి మహిళలకు కుట్టుమిషన్లు, మూడు జిగ్‌జాగ్ మిషన్లు, ఒక ఫ్లోర్ మిషన్, ఒక గ్రైండర్, ఒక జిరాక్స్ మిషన్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఆర్డీటీ పేదలకు అండగా నిలుస్తోందన్నారు. పిల్లల్ని మంచి చదువులు చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ హేమలత, స్పానిష్ మహిళ, ఆర్డీ ప్రమీల, ఎస్టీఎల్ వనజ, కావేరి, ఏడీ ప్రకాష్‌రెడ్డి, రీజనల్ ఏటిఎల్‌లు, సీఓలు, ఎంఅండ్ఈ ఇందిర, ఏటీఎల్ రుక్మాంగద తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కిడ్నీ రోగికి పింఛన్ అందజేత

ధర్మవరం: పట్టణంలోని చిన్నూరు గ్రామానికి చెందిన ఆదినారాయణకు వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద డయాలసిస్ పెన్షన్ రూ.10 వేలు మంజూరయ్యాయి. శుక్రవారం వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేశారు.

పరామర్శ

పుట్టపర్తి అర్బన్: మండలంలోని వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ వాల్మీకి పెద్ద లక్ష్మణ్ణ (80) శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. కుటుంబానికి ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, సర్పంచ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఓడీ చెరువు: మండలంలోని మిట్టపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోవిందు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎమ్మెల్యే దుద్దుకుంటశ్రీధర్‌రెడ్డి శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్లకృష్టారెడ్డి, నాయకులు నాగు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లి గ్రామం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యశ్వీత్, దీప తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పార్లపల్లికి చెందిన యశ్వీత్, దీప నల్లచెరువు నుండి ఆటోలో వస్తుండగా గ్రామం దగ్గరలో ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీకొంది. ఈ ఘటనలో దీపకు చేయి విరిగింది. యశ్వీత్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని కదిరిలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మల్కాపురం గ్రామానికి చెందిన లింగమయ్య అప్పుల బాధతో శుక్రవారం విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కాగా లింగమయ్య కలర్ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో మరో వ్యక్తి..

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి శుక్రవారం కుటుంబ కలహాలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

మాజీ సర్పంచ్‌కు గాయాలు

ముదిగుబ్బ: మండల పరిధిలోని గాండ్లవారిపల్లి మాజీ సర్పంచ్ రామ్మూర్తి శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సొంత పనిమీద ముదిగుబ్బకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ముదిగుబ్బ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన రామ్మూర్తిని 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

కాటమరెడ్డి కుటుంబం సేవలు మరువలేనివి

కనగానపల్లి: విద్యాభివృద్ధి కోసం కాటమరెడ్డి రమణారెడ్డి కుటుంబ సభ్యులు చేసిన సేవలు మరువలేనివని మామిళ్లపల్లి కేఆర్ ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం స్నేహలత తెలిపారు. శుక్రవారం పాఠశాల మూలధనం (కార్పస్ ఫండ్) దాత కాటమరెడ్డి రమణారెడ్డిని వర్ధంతిని పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధి నిధి కోసం రమణారెడ్డి కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి తల్లి కేశమ్మ, సోదరుడు శ్రీనివాసులురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నాగేంద్రరెడ్డి, నాగరాజు, ఎస్వీ శివారెడ్డి, రామచంద్ర, జయచంద్ర, పీడీ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా అభివృద్ధికి ప్రార్థనలు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని షాదీఖానా అభివృద్ధికి శుక్రవారం 5 మసీదులకు చెందిన ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షాదీఖానా అభివృద్ధిపై చర్చించారు. నూతన కమిటీ సభ్యులను అభినందించారు. షాదీఖానా అభివృద్ధికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వక్ఫ్‌బోర్డు నుంచి రూ.35 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో దర్గా కమిటీ మేనేజర్ అతావుర్ రహిమాన్, ముతవల్లీలు అజీజుర్‌రహిమాన్, నూర్ మహమ్మద్, ఎంపీటీసీ రఫీ, షాన్‌షేట్, అయ్యుబ్ ఖాన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తనకల్లు: ఈనెల 2వ తేదీన పొలం దగ్గర పంటలకు వాడే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన దండువారిపల్లికి చెందిన సిద్దా విదీష్ నాయుడు (23) అనంతపురంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాంభూపాల్ శుక్రవారం తెలిపారు. పంటలు సాగు చేసేందుకు చేసిన అప్పులు తీర్చలేక కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించకపోతే ఎలా?

బత్తలపల్లి: నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే.. క్షేత్రస్థాయిలో నాసిరకం భోజనం అందిస్తారా అంటూ కేజీబీవీ ఎస్ఓ నాగరత్నపై ఎంపీపీ వెంగళరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజీవపురం వద్ద ఉన్న కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమతం ఈశ్వరయ్యతో కలిసి తనిఖీ చేశారు. కాంట్రాక్టర్ జితేంద్రకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం సరుకులు పంపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.